క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ పేట, బూసమ్మ కాలనీ, పంచాయతీ ప్రాంతం, శ్రీరామ్ నగర్, అఫీషియల్ కాలనీ, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం, బీసీ కాలనీ, కాతేరు గ్రామంలోని బ్రాహ్మణ అగ్రహారం, కొంతమూరులోని కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, ఫోర్త్ బ్రిడ్జి ఏరియాలలో సరఫరా ఉండదు.

23న మెగా రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 23న నగరంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు, గోరంట్ల శాంతారామ్ ఫౌండేషన్ఆధ్వర్యంలో ప్రియాంక గార్డెన్స్‌లో ఈ శిబిరం జరుగుతుందన్నారు. అదే రోజు అమరావతి, భవాని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు శ్రీకారం చుడుతున్నామన్నారు.

మురుగునీటి సమస్య పరిశీలన

కడియం: మురమండ గ్రామంలోని ఏఎంజీ నగర్‌లో నెలకొన్న మురుగునీటి సమస్యను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మురుగునీరు తాత్కాలికంగా బయటకు పోయేలా 24 గంటల్లో చర్యలు తీసుకుంటానని, అలాగే నూతన డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని, ఏప్రిల్ నాటికి శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ పోసిబాబు, పీఆర్ డీఈ రవి, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, ప్రత్తిపాటి రామారావు చౌదరి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఏవో మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు వివిధ సేవలు అందించడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వీఏఏ సంఘ అధ్యక్షుడు కె.దుర్గబాబు, ఉపాధ్యక్షులు తమ్మినాయుడు, డి.సురేష్, రాష్ట్ర ఏఈవో సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవ్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం కార్యదర్శి కమల్ రాజు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు తక్షణమే కేటాయించాలి

ప్రకాశం నగర్: ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లు కేటాయించాలని మహిళా సమాఖ్య కన్వీనర్ పి.లావణ్య డిమాండ్ చేశారు. స్థానిక అంబల్ల సూర్యారావు భవన్‌లో సోమవారం సాయంత్రం మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లావణ్య మాట్లాడుతూ ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశాలను ఫిబ్రవరి 2, 3 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరుస్తామని టిడ్కో ద్వారా రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష డిపాజిట్లు కట్టించుకుని ఇళ్లు కేటాయించలేదన్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి అయిన ఇళ్లను 10 శాతం పనులు పూర్తి చేసి పేదలకు ఇళ్లు అందించాలన్నారు. సమావేశంలో సేపేని రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి సావిత్రీబాయి అవార్డు



సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి

కంబాలచెరువు: స్థానిక లాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బీబీవీఎస్ యూబీఏ లక్ష్మీదేవిని సావిత్రీబాయి పూలే జాతీయ అవార్డు వరించింది. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నీరు పారేనా..

- పంట కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు
- గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు సరేసరి
- ముందుకు ప్రవహించని నీరు
- శివారు చేలకు నీటి ఎద్దటి
- అన్నదాతల అవస్థలు

కడియం: ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల కలిగే అనర్థాలపై ఎంతగా ప్రచారం చేస్తున్నా, అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ సాగునీటి కాలువలు, డ్రైనేజీల్లోకి చేరి నీటిని కలుషితం చేస్తున్నాయి. దీంతో నీటిపారుదలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్లను ప్లాస్టిక్ సీసాల్లోనే విక్రయిస్తున్నారు. వాటిని తాగేసిన తర్వాత బాటిళ్ల వ్యర్థాలు సాగు నీటి కాలువలు, మురుగు కాలువల్లోకి చేరుతున్నాయి.

సాగునీటి వ్యవస్థకు ముప్పు

ప్రతి నిత్యం వేలాదిగా వస్తున్న ఈ వ్యర్థ బాటిళ్ల కారణంగా సాగునీటి వ్యవస్థకే ముప్పు ఏర్పడుతోంది. పెద్ద కాలువల నుంచి చిన్న పంట కాలువలు, బోదెల వెంబడి ప్రయాణించి వ్యవసాయ క్షేత్రాలకు చేరుతున్నాయి. మార్గం మధ్యలో ముప్పలుగా పేరుకుపోతుండడంతో సాగునీరు కూడా ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా ధవళేశ్వరం నుంచి ప్రారంభమయ్యే తూర్పు డెల్టా ప్రధాన కాలువలైన కాకినాడ కాలువ, కోటిపల్లి కెనాల్స్, గ్రామాల్లో విస్తరించి ఉన్న పంట కాలువల్లోకి ఈ బాటిల్స్ పెద్ద ఎత్తున చేరుతున్నాయి. వీటికి పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క కూడా తోడవ్వడంతో సాగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో కాలువ శివారు ప్రాంతాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



మడికి నుంచి దుళ్ల మీదుగా ఏడిద వెళ్లే సాగునీటి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు కాలువలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

రైతుల అవస్థలు

కడియం మండలంలోని జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల, వీరవరం, కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాల వెంబడి సాగునీటి కాలువల్లోకి చేరుతున్న సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. కొత్తపేట మండలం మడికి నుంచి ప్రారంభమై దుళ్ల మీదుగా మండపేట రూరల్ మండలం ఏడిద వరకు గల సాగునీటి కాలువను ఈ వ్యర్థాలు ముంచెత్తాయి. వీటిని తొలగించేందుకు సంబంధిత శాఖలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలువ మొత్తం ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

పంట కాలువలను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించడం కష్టతరంగా ఉంటుందని హైకోర్టు పంచాయతీరాజ్ శాఖ చట్టంలో కాలువలు ఎటువంటి ఆక్రమణలు జరగకుండా చూడటంతో పాటు, కాలువల్లో ఎటువంటి చెత్తాచెదారాలు వేయకుండా పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనిపై సదరు పంచాయతీ అధికారులకు నోటీసులు సైతం జారీ చేసినట్లు చెబుతున్నారు.

చేలకు నీరందడం లేదు

> పంటకాలువల్లో ప్లాస్టిక్ సీసాలు, వ్యర్థాలు నిండిపోవడంతో చేలకు నీరు చేరడం లేదు. ఇప్పటికే కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల నీటి ప్రవాహం పూర్తిస్థాయిలో లేదు. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అస్సలు నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికేనా సదరు అధికారులు చర్యలు తీసుకోవాలి.
>
> – చామకూర పట్టియ్య, రైతు, దుళ్ల

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలి



డీఆర్ఓ సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ్మూర్తిని యూటీఎఫ్ జిల్లా సంఘం కోరింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓను కలిశారు. ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరడంతో పాటు కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో పనిచేసే ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వచ్చేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి కె.రమేష్, ఎం.శ్రీనివాస్, చిలుకూరి శ్రీనివాసరావు, కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

కంబాలచెరువు: ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు అర్బన్ తహసీల్దార్ పాపారావుకి వినతిపత్రం అందచేశారు. ఎ.ఉదయ బ్రహ్మం, వి.అప్పయ్య శాస్త్రి, జి.తాతారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ కె.విజయ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పర్మినెంట్ వే కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విజయ కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు రోజుకు రెండు షిఫ్టుల పని విధానం ప్రవేశపెట్టాలని, నైట్ పెట్రోల్ మెన్ డ్యూటీకి ఇద్దరిని ఇవ్వాలన్నారు. నైట్ పెట్రోల్ మెన్ దూరాన్ని 10 కిలోమీటర్లకు తగ్గించాలని, ట్రాక్ ఉమెన్స్‌ను డిపార్ట్ మెంట్ లోనికి మార్చాలని, ట్రాక్‌మెన్లకు రూ.4200 నుంచి రూ.4600కు గ్రేడ్ పే ను అమలు చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం సాగిస్తామన్నారు. నిరసనలో ఓపెన్ లైన్ సెక్రటరీ ధర్మాల శ్రీనివాస రెడ్డి, చైర్మన్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని జేసీ చిన్న రాముడు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి డివిజన్ మండల స్థాయి అధికారులతో హౌసింగ్, జాతీయ రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎన్‌పీసీఐ, ఎంఎస్ఎఈ సర్వే, జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాకు నిర్దేశించిన 3,823 ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని 2025 మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని మూడు అర్బన్ ప్రాంత పరిధిలో కొత్త లేఅవుట్‌లలో ఇళ్ల కోసం భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలన్నారు. రుడా పరిధిలోని అన్ని గ్రామాల్లో కొత్త ఇళ్ల కోసం సర్వే చేసి, వాటి వివరాలను హౌసింగ్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల డెలివరీ మనుషులు అదనపు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామ్ కుమార్ కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరంలోని కళాశాలలో బీటెక్ చదువుతున్న ఆమె సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లలేదు. అయితే మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అదృశ్యమైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి సంఘటనపై త్రీటౌన్‌లో ఫిర్యాదు



మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తిరుపతిలో ఈనెల 9 న జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన సంఘటనపై మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సోమవారం రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తొక్కిసలాటలో భక్తులు చనిపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. దీనికి ప్రభుత్వం, టీటీడీ చైర్మన్, ఆలయ ఈవో, జేఏవోలను ముఖ్య బాధ్యులుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయంలో పెద్దస్థాయిలో ఉత్సవాలు, కార్యక్రమాలు నిర్వహించేముందు దానిపై కచ్చితంగా సమీక్ష, సన్నద్ధక సమావేశం జరపాలన్నారు. కానీ తిరుపతిలో అటువంటివేమీ లేకుండా టిక్కెట్లను పంపిణీ చేసేశారన్నారు. ఇటువంటి సంఘటన పక్క రాష్ట్రంలో జరిగితే ప్రభుత్వం బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టిందన్నారు. లడ్డూ విషయంలో సిట్ వేసిన ప్రభుత్వం ఆరుగురు భక్తులు చనిపోతే ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. తొక్కిసలాట సంఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన కోరారు.

హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదల



క్రెటా ఎలక్ట్రిక్ కారును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: ఆధునాత గ్లోబెల్ ఈవీ టెక్నాలజీతో హ్యుందాయ్ కంపెనీ తయారు చేసిన క్రెటా ఎలక్ట్రిక్ కారును సోమవారం లక్ష్మీ హ్యుందాయ్ షోరూమ్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీఈ గ్రూప్ రాజమండ్రి హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఆర్ఎస్‌వీ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ కారులో అధునాతన ఫీచర్లతో కూడిన సరికొత్త అల్టిమేట్ బ్యాటరీ ఏర్పాటు చేశారన్నారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 473 కిలోమీటర్లు పరుగులు తీస్తుందని, బ్యాటరీ 10 శాతం నుంచి 80 శాతం వరకు 58 నిమిషాలలో (50 కేడబ్ల్యూ), 39 నిమిషాలలో (100 కేడబ్ల్యూ) డీసీ చార్జింగ్ అవుతుందన్నారు. కేవలం 7.9 సెకన్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగానికి చేరుకుంటుందన్నారు. వీ2ఎల్ (వెహికల్ టు లోడ్) ఫీచర్ బ్యాటరీతో పాటు సెల్‌ఫోన్లు, లాప్‌ట్యాప్‌లను చార్జింగ్ చేయవచ్చన్నారు.42 కేడబ్ల్యూహెచ్, 52.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌లలో ఎగ్జిక్యూటివ్ స్మార్ట్, స్మార్ట్(0), ప్రీమియం, ఎక్సలెంట్ వేరియంట్‌లో విడుదల చేస్తున్నారన్నారు. ఈ కారు రూ.17.99 లక్షల నుంచి రూ.23.50 లక్షల ధరలో లభ్యమవుతుందన్నారు.

కడియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

కడియం: కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. కడియంతో పాటు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. పూర్వ విద్యార్థులందరూ ఒకచోటకు చేరడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం తమ జ్ఞాపకాలు పదిలపర్చుకునేందుకు ఫోటోలు దిగారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సహచర మిత్రులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సమ్మేళనానికి కృషి చేసిన మిత్రులను అభినందించారు. కార్యక్రమంలో మార్ని లలిత, సలాది హారిక, మార్ని సుజాత, అబ్బిరెడ్డి సునీత, మార్ని జ్యోతి, కవికొండల శ్రీనివాస్, వనుం శ్రీనివాస్, దుప్పలపూడి సుధాకర్, కోరుకొండ రమేష్, కంచుమర్తి సతీష్, కదలి హరి, బండారు గంగాధర్, వర్మ, చక్రవర్తి, బాలాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పునాది అభ్యసనం ఎంతో కీలకం



మాట్లాడుతున్న ప్రాజెక్టు అడిషనల్ కో ఆర్డినేటర్ సుభాషిణి

రాజానగరం: ప్రాథమిక విద్యలో పునాది అభ్యసనం ఎంతో కీలకమని సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు అడిషనల్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన ప్రకాష్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి 8వ బ్యాచ్ శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలు తెలిసి ఉండాలన్నారు. జిల్లా నుంచి 275 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 80 ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లాలలో ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులందరికీ 14 బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో 24 మంది డీఆర్పీలు, ముగ్గురు కెఆర్పీలు, ఏఎంఒ డి.గౌరీశంకరరావు, కో ఆర్డినేటర్లు ఎస్.కనక బాబు, ఏస్తేరురాణి, ఎంఈఓలు జ్యోతిప్రసాద్, మధుసూదనరావు, జిల్లా కోఆర్డినేటర్ అనూష, పాల్గొన్నారు.

పోక్సో కేసులో రిమాండ్

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన పండలనేని దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న తన కుమార్తె ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ కారులో తీసుకువెళుతుండగా కిర్లంపూడి వద్ద అరెస్టు చేశామన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించామన్నారు.

ప్రేమంటూ మాటలు కలిపి.. పెళ్లయ్యాక నరకం చూపి..

- ఎస్టీ యువతికి వేధింపులు
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంతం

కంబాలచెరువు: ప్రేమ పేరుతో తనను నమ్మించి, పెళ్లి చేసుకున్న తర్వాత చిత్రహింసలకు గురి చేయడంతో పాటు హత్యాయత్నం చేసిన జాన దివ్యశేఖర్‌ను కఠినంగా శిక్షించాలని ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన 24 ఏళ్ల లక్ష్మీకాంతం కోరింది. ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.మోహన్‌కుమార్‌తో కలిసి సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. బాధితురాలి వివరాల ప్రకారం.. లక్ష్మీకాంతం భర్తతో వేరుపడి ఒంటరిగా కోలమూరులో జీవిస్తోంది. తన ఇంటి నిర్మాణం కోసం జాన దివ్యశేఖర్‌కు చెందిన ఎలక్ట్రికల్ షాపునకు సామాన్లు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. అక్కడ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. లక్ష్మీకాంతం, ఆమె కుమార్తెకు తోడు ఉంటానని నమ్మబలికి దివ్య శేఖర్ వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. అయితే అంతకు ముందే అతడికి వివాహమైంది. అలాగే లక్ష్మీకాంతం దగ్గర ఉన్న డబ్బుతో ఎలక్ట్రికల్ సామాగ్రి షాపు పెట్టించాడు. అనంతరం ఆమెను దూరంగా పెట్టడంతో పాటు ఆమె ఆనారోగ్యంతో షాపునకు వెళ్లని సమయంలో దానిలో సామగ్రిని వేరే చోటుకు తరలించాడు. ఈ విషయం ప్రశ్నించేందుకు దివ్యశేఖర్ షాపు వద్దకు వెళ్లిన లక్ష్మీకాంతాన్ని అతడితో పాటు, ఆయన భార్య, సోదరుడు, కుమారుడు కులం పేరుతో దూషించి, విచక్షణా రహితంగా కొట్టి, ఒంటిపై పెట్రోలు వేసి నిప్పంటించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బాధితురాలికి అన్యాయం

మోహన్ కుమార్ మాట్లాడుతూ కేసు విషయంలో బాధితురాలికి అన్యాయం జరిగిందన్నారు. నిందితులకు కొందరు అధికారులు కొమ్ముకాశారని ఆరోపించారు. ఈ విషయంపై గత సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ దర్యాప్తు సక్రమంగా జరగడం లేదన్నారు. బాధితురాలికి ప్రాణహాని ఉన్నందున ఆమెకు తగిన రక్షణ కల్పించాలని, తగిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్సీ నాయకులు మత్తి జయప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో అర్జీలకు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సీతారామ్మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను జవాబుదారీతనంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ్మూర్తి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి జిల్లా స్థాయి అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వంద అర్జీలు స్వీకరించామన్నారు. నిర్ణీత సమయంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో..

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందిస్తామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్త్ ఆఫీసర్ వినూత్నతో కలిసి 19 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.